


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 179 | గురువారం 18 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## హైదరాబాద్‌కు చేరుకున్న

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తెలంగాణ -సూర్య వాస్తవం, డిసెంబర్ 17:

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. హకీం పేటలోని ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి ప్రత్యేక విమానం ద్వారా చేరుకున్న ఆమెకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు స్వాగతం పలికారు. 18వ తేదీన

- మిగతా 2లో..



# ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

- మస్కట్ విమానాశ్రయంలో ప్రధానికి సైనిక వందనంతో స్వాగతం
- ఒమన్ సుల్తాన్‌తో వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు
- భారత్-ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తి
- ఇథియోపియా పర్యటన ముగించుకుని ఒమన్‌కు వచ్చిన ప్రధాని

2లో




## అది మీ కుటుంబం ఆస్తి కాదు,

# నెహ్రూ లేఖలు వెనక్కివ్వండి

- సోనియా గాంధీకి కేంద్రం సూచన
- నెహ్రూ లేఖలు, కార్టూన్లు సోనియా వ్యక్తిగత ఆస్తులు కావన్న గజేంద్రసింగ్ షెకావత్
- 2008లో సోనియా గాంధీ ఆ లేఖలను తీసుకున్నారన్న కేంద్రం
- నెహ్రూ లేఖలు, కార్టూన్లు ఎందుకు తిరిగివ్వడం లేదని సోనియాకు ప్రశ్న



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:

భారత తొలి ప్రధాని నెహ్రూకు సంబంధించిన లేఖలు, కార్టూన్లు సోనియా గాంధీ వ్యక్తిగత ఆస్తులు కావని, అవి దేశ ఆస్తి కాబట్టి వాటిని తిరిగి అప్పగించాలని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ డిమాండ్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య వివిధ అంశాలపై వాడి వేడిగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో జవహర్ లాల్ నెహ్రూ లేఖలకు సంబంధించి బుధవారం బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మధ్య వాగ్యుద్ధం జరిగింది. నెహ్రూ లేఖలు తిరిగి

- మిగతా 2లో..

## రాష్ట్రంలో కొత్త డిస్కంకు

# సర్కార్ ఆమోదం

- ఉత్తర్వులు జారీ చేసిన ఇంధన శాఖ
- ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌కు ఆదేశం
- సబ్సిడీలు, రైతుల ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉన్నాం
- జీవోలో స్పష్టం చేసిన ప్రభుత్వం

హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 17:




రాష్ట్రంలో మూడో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం జీవో నెంబర్ 44 విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఇందన శాఖ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంల పరిధి ఎక్కువగా ఉండటం, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు

- మిగతా 2లో..



## షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు

- సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన చంద్రబాబు, పవన్
- బహిరంగంగా శుభాకాంక్షలు తెలపని జగన్

2లో

## మిగిలిన నిధులను

# జనవరి 15లోగా ఖర్చు చేయాలి

- కేంద్ర నిధుల వినియోగంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పీఎంఏవై-అర్బన్ పథకంలో తక్కువ ఖర్చుపై తీవ్ర అసంతృప్తి
- ఈ ఏడాది రూ.30 వేల కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యం
- నిర్వీర్యంగా ఉన్న ప్రభుత్వ ఖాతాల్లోని నిధులపై సీఎం ఆరా

అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 17:




కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో, వివిధ శాఖల వద్ద ఇంకా రూ.6,252 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోవడంపై అధికారులను ఆయన నిలదీశారు. ఈ నిధులన్నింటినీ రాబోయే జనవరి 15వ తేదీలోగా నూటికి నూరు శాతం ఖర్చు చేయాలని గట్టిగా

- మిగతా 2లో..



## భూ కేటాయింపుల్లో టూరిజం, ఐటీ రంగాలకు

# అధిక ప్రాధాన్యం

- 82 వేల ఎకరాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశం...
- జిల్లా కలెక్టర్లతో కొనసాగుతున్న సీఎం చంద్రబాబు సమీక్ష
- 22ఏ పరిధిలోని 82 వేల ఎకరాల ఏపీఐఐసీ భూములపై కీలక ఆదేశం
- సాంకేతిక సమస్యలు లేకుంటే కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు తేవాలని సూచన
- 18 నెలల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న సీఎం

అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 17:

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూముల కొరత రాకుండా చూడాలని ముఖ్య మంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా పారిశ్రామిక

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రైవేట్ విద్యాసంస్థలకు

# నిబంధనల సడలింపు

- ఐదేళ్లకు ఒకసారి ఫైర్ ఎన్‌వోసీ సరిపోతుంది
- ఇకపై పదేళ్లకు ఒకసారి స్కూల్స్ రెన్యూవల్
- పాదయాత్ర హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్
- ఈ మేరకు జీవో జారీ చేసిన కూటమి ప్రభుత్వం

అమరావతి -సూర్య వాస్తవం, డిసెంబర్ 17:

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ విద్యాసంస్థలకు కూటమి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన కఠిన నిబంధనలను సడలిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా, ఏటా ఫైర్ సేఫ్టీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్

- మిగతా 2లో..



## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

నిలయంలో విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. 21న నిలయంలో నిర్వహించే పౌరుల భేటీ, ఎట్ హెూం లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతాం

## ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

- మస్కట్ విమానాశ్రయంలో ప్రధానికి సైనిక వందనంతో స్వాగతం
- ఒమన్ సుల్తాన్‌తో వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు
- భారత్-ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తి
- ఇథియోపియా పర్యటన ముగించుకుని ఒమన్‌కు వచ్చిన ప్రధాని

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో చివరి అంకానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఒమన్ రాజధాని మస్కట్‌లో అడుగుపెట్టారు. మస్కట్ విమానాశ్రయంలో ఒమన్ ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యద్ షిహాబ్ బిన్ తారిఖ్ అల్ సయీద్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీకి సైనిక వందనంతో గౌరవ స్వాగతం లభించింది. భారత్, ఒమన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతోంది. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్‌తో ప్రధాని మోదీ విస్తృత స్థాయి చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణ, భద్రత, సాంకేతికత వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 2018 తర్వాత ప్రధాని మోదీ ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతేడాది డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ భారత్‌లో పర్యటించారు. శతాబ్దాల నాటి సముద్ర వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలతో ఇరు దేశాల బంధం బలపడిందని విదేశాంగ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఇరు దేశాల వ్యాపార ప్రముఖులతో సమావేశమవుతారు. అలాగే, ఒమన్‌లో స్థిరపడిన భారత ప్రవాస సంఘంతో కూడా భేటీ కానున్నారు. ఒమన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఇథియోపియాలో రెండు రోజుల పాటు పర్యటించారు. ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ.. స్వయంగా కారు నడుపుతూ మోదీని విమానాశ్రయానికి తీసుకెళ్లి వీడ్కోలు పలకడం విశేషం. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'ను కూడా మోదీ అందుకున్నారు.

## అది మీ కుటుంబం ఆస్తి కాదు, నెహ్రూ లేఖలు వెనక్కివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చేయాలని, అవి గాంధీ కుటుంబం ఆస్తులు కావని సాంస్కృతిక శాఖ సోనియా గాంధీకి స్పష్టం చేసింది. అంతకుముందు, నెహ్రూకు సంబంధించిన లేఖలు ఎక్కడున్నాయని, వాటి ఆచూకీ లేకుండా చేసినందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల డిమాండ్‌పై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్పందించారు. ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం, లైబ్రరీ నుంచి నెహ్రూ లేఖలు అదృశ్యం కాలేదని స్పష్టం చేశారు. 2008 ఆగస్ట్ 29వ తేదీతో కూడిన ఉత్తరంలో సోనియా గాంధీ ప్రతినిధి ఎంవీ రాజన్ నెహ్రూకు సంబంధించిన వ్యక్తిగత ఉత్తరాలను, నోట్స్‌ను ఆమె తిరిగి తీసుకునేందుకు అనుమతించాలని కోరారని తెలిపారు. ఈ లేఖ ఆధారంగా నెహ్రూ వ్యక్తిగత పత్రికల్లో ముద్రితమైన 51 కార్టూన్లను 2008లో సోనియా గాంధీకి అప్పగించారని అర్థమవుతోందని తెలిపారు. సోనియా కార్యాలయం నుంచి వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పీఎంఎంఎల్ ప్రయత్నిస్తోంది. ఈ విషయమై ఈ సంవత్సరం రెండుసార్లు సోనియా గాంధీకి లేఖలు రాశామని అన్నారు. ఆ లేఖలు అదశ్యం కాలేదని, అవి ఎవరి దగ్గర ఉన్నాయో తమకు తెలుసని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆ లేఖలను అప్పగించాలని ఆయన సోనియాకు విజ్ఞప్తి చేశారు. నెహ్రూ లేఖలు, కార్టూన్లను ఎందుకు తిరిగివ్వడం లేదో దేశ ప్రజలకు చెప్పాలని సోనియా గాంధీని కేంద్ర మంత్రి 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. వాటిని మీ వద్ద ఎందుకు అట్టిపెట్టుకున్నారని, అందులో ఉన్న రహస్యాలేమిటని ప్రశ్నించారు. ఎంతో ముఖ్య మైన చారిత్రక డాక్యుమెంట్లు ఇంకా ప్రజలకు ఎందుకు అందుబాటులో లేకుండా పోయాయని అన్నారు. అవి మీ కుటుంబ వ్యక్తిగత పత్రికలు కాదని తేల్చిచెప్పారు.

## షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు

**అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 17:**

ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాజకీయ పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా షర్మిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖ సంతోషాలు అందించాలని ఆకాంక్షించారు. అయితే, షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆమెకు బహిరంగంగా శుభాకాంక్షలు తెలుపలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య దూరాన్ని స్పష్టం చేస్తోంది.

## రాష్ట్రంలో కొత్త డిస్కంకు సర్కార్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

డిస్కంల ఆర్థిక కష్టాలను తీర్చేందుకు మూడో డిస్కం ఉపయోగ పడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలోనే మూడో డిస్కం ఏర్పాటుకు సంబందించి ప్రభుత్వం విధివిదానాలను ప్రకటించింది. మూడో డిస్కం ఏర్పాటకు సూచించిన విధివిధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్) నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) ప్రభుత్వం ఆదేశించింది. ఎల్‌టీ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వినియోగదారులు, స్మార్ట్ మీటర్ హెూల్డర్లు, మానవ వనరులను మూడో డిస్కంకు కేటాయించాలని పేర్కొంది. సరిహద్దుల నిర్ధారణ, టీజీ జెన్కో, ఇంటర్-స్టేట్ సోలార్, సీజీఎస్, ఐపీపీలతో ఎస్పీడీసీఎల్‌కు 70.55, ఎన్పీడీసీఎల్‌కు 29.45 శాతం ఉన్న పవర్ పర్చేస్ అగ్రిమెంట్‌కు అనుగుణంగా మూడో డిస్కంకు విద్యుత్ కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలని సూచించింది. మూడో డిస్కంకు 600 ఇంజినీర్లు, 1,000 ఆర్టిజన్లు, ఓఅండ్‌ఎం స్టాఫ్, 340 మంది అడ్మినిస్ట్రేషన్ సిబ్బందిని కేటాయించాలని ప్రభుత్వం సూచించింది. మూడో డిస్కం అమల్లోకి వచ్చేనాటికి వాటి ఆస్తులు, అప్పుల ఆధారంగా ప్రత్యేక బ్యాలెన్స్ షీట్‌ను సిద్ధం చేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది.

**సబ్సిడీలన్ని మూడో డిస్కం పరిధిలోకే**

వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందించే పథకాలన్ని మూడో డిస్కం పరిధిలోకి తీసుకు రానున్నారు. ఇందుకు సంబంధించిన తాజాగా ప్రతిపాదించిన విధివిదానాలకు అనుగనంగా బదిలీ చేయనున్నారు. బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో రెండు డిస్కంలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విద్యుత్ ముసాయిదా బిల్లుకనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సంస్కరించే చర్యల్లో బాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## మిగిలిన నిధులను జనవరి 15లోగా ఖర్చు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. "ఒకవైపు నిధులు లేక ఇబ్బందులు పడుతుంటే, కేంద్ర పథకాల్లో అందుబాటులో ఉన్న నిధులను కూడా ఖర్చు చేయకపోవడమేంటి?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మొత్తం రూ.24,513 కోట్ల విలువైన పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఇంత పెద్ద మొత్తంలో నిధులు మిగిలిపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) - అర్బన్ పథకం కింద కేవలం 38 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ నిధుల వినియోగాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మంత్రి కొలుసు పార్థసారథిని ఆదేశించారు. గతంలో విజిలెన్స్ విచారణ కారణంగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలకు వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలించాలని, తద్వారా నిధుల ఖర్చును వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా పథకం కింద రూ.1363 కోట్లకు గాను ఇప్పటికే రూ.1259 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన నిధులను కూడా త్వరగా పూర్తి చేస్తామని సీఎంకు వివరించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి రాష్ట్రానికి అదనంగా రూ.1200 కోట్లు కోరినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అదనంగా నిధులు రాబట్టుకోవడంపై చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. "జనవరి నాటికి పీఎంఏవై అర్బన్‌లో 75 శాతం నిధులు ఖర్చు చేస్తే అదనంగా నిధులు సాధించవచ్చు. ఈ ఏడాది కేంద్ర పథకాల ద్వారా రూ.30 వేల కోట్ల ఖర్చును లక్ష్యంగా పెట్టుకుందాం. ప్రస్తుతం ఉన్నవి ఖర్చు చేస్తే మరో రూ.5 నుంచి 6 వేల కోట్లు అదనంగా తెచ్చుకోవచ్చు" అని తెలిపారు. కేంద్ర బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ మొదలవుతున్నందున, సంబంధిత కేంద్ర మంత్రులతో టచ్‌లో ఉండాలని, ఏపీకి అదనపు ప్రయోజనాలు చేకూరేలా చూడాలని సూచించారు. ఇదే సమావేశంలో, రాష్ట్రవ్యాప్తంగా 63 వేల ప్రభుత్వ ఖాతాలు నిర్వీర్యంగా (ఇన్ యాక్టివ్) ఉన్నాయని, వాటిలో సుమారు రూ.155 కోట్ల నిధులు ఉండిపోయాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఆ నిధులను వెంటనే విత్‌డ్రా చేయించి, కనీసం వడ్డీ అయినా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని శాఖల ఆడిట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## భూ కేటాయింపుల్లో టూరిజం, ఐటీ రంగాలకు అధిక ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాల భూమి 22ఏ (నిషేధిత జాబితా) పరిధిలో ఉండటం వల్ల పెట్టుబడులకు ఆటంకంగా మారిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి, ఆ 82 వేల ఎకరాల భూమికి సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే, ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భూ కేటాయింపుల్లో పర్యాటక రంగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత ఐటీ కంపెనీలకు కేటాయించాలని చంద్రబాబు సూచించారు. గత 18 నెలల్లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో రూ.8.55 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ పనులు కూడా ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖ, తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హెూటళ్లు, టూరిజం ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు.

## ప్రైవేట్ విద్యాసంస్థలకు నిబంధనల సడలింపు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలన్న నిబంధనను సవరిస్తూ విద్యాశాఖ జీవో విడుదల చేసింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం, 30 మీటర్ల లోపు ఎత్తు ఉన్న విద్యాసంస్థల భవనాలు ఇకపై ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఫైర్ ఎన్‌వోసీ తీసుకుంటే సరిపోతుంది. అదేవిధంగా, పాఠశాలల రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ (రెన్యూవల్) గడువును పదేళ్లకు ఒకసారిగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తన పాద యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ మార్పులు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రతి ఏటా ఎన్‌వోసీ తీసుకోవాలన్న నిబంధన ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, దీన్ని మార్చాలని పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మంత్రి లోకేశ్ ఈ ఫైల్‌పై చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ నిబంధనల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించడంతో రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి



## హాస్టళ్లలో విద్యార్థులకు ఏం జరిగినా ముందు సస్పెండ్ చేస్తా

- విద్యార్థుల భద్రతపై అధికారులకు సీఎం చంద్రబాబు వార్నింగ్
- సంక్షేమ హాస్టళ్లలో కలెక్టర్లు నిద్ర చేయాలన్న సీఎం
- సూపర్ సిక్స్ పథకాల అమలుకు క్యాలెండర్ సిద్ధం చేయాలని ఆదేశం

**అమరావతి -సూర్య వాస్తవం, డిసెంబర్ 17:**

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి హాని జరిగినా సంబంధిత అధికారులను ముందుగా సస్పెండ్ చేసి, ఆ తర్వాతే మిగతా విషయాలు మాట్లాడతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా హెచ్చరించారు. అమరావతిలో మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా సంక్షేమ హాస్టళ్లలో నిద్ర చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. విద్యార్థుల బాగోగులు ప్రత్యక్షంగా తెలుసుకోవాలని, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించాలన్నారు. 7 నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం వంటివి ప్రవేశపెట్టాలని, పాఠశాలల్లో క్రీడలను తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సహా ఇతర సంక్షేమ పథకాల అమలుకు ఒక స్పష్టమైన క్యాలెండర్ రూపొందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చేపట్టిన "ముస్తాబు" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో రాణించేలా ప్రోత్సహించాలని, వారి కెరీర్‌కు సరైన ప్రణాళికలు రూపొందిస్తే విప్లవాత్మక మార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం ఫుడ్ పార్కులు ఏర్పాటు చేయాలని, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గిరిజన కార్పొరేషన్ ద్వారా హెూటళ్లు నిర్మించాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఫుడ్ పార్కు కోసం 250 ఎకరాలు కేటాయిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. పీ4 పద్ధతిలో సంక్షేమ హాస్టళ్లను దత్తత తీసుకునే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు.

# సంపాదకీయం

## భారీగా తగ్గిన నిరుద్యోగ రేటు



భారత దేశం యువ జనాభా ఎక్కువగా ఉన్న దేశం. మనకు యువతే బలం. పుష్కలమైన మానవ వనరులు ఉండడం మనకు బలం. అయితే దేశంలో సరిపడా ఉద్యోగాలు లేకపోవడం యువతకు శాపంగా మారుతోంది. దీంతో ప్రభుత్వాలు స్వయం ఉపాధివైపు మళ్లిస్తున్నాయి. మరోవైపు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుయి. మరోవైపు కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం భారీగా ఉద్యోగాల భర్తీ చేపడుతోంది. ఈ నేపథ్యంలో దేశంలో నిరుద్యోగ రేటు క్రమంగా తగ్గుతోంది. 4.7 శాతంగా నమోదైంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్) తాజా డేటా ప్రకారం ఇది 8 నెలల కనిష్ఠ స్థాయికి తగ్గింది.అక్టోబర్‌లో 5.2 శాతం ఉన్న రేటు నుంచి గణనీయ తగ్గుదల సంభవించింది. గ్రామీణ మొత్తంలో 3.9 శాతానికి, పట్టణాల్లో 6.5 శాతానికి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ మార్పు ఎక్కువగా కనిపిస్తోంది, ఇది వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమల పునరుద్ధరణకు సంబంధించినది.అధికారుల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉపాధి అవకాశాలు పెరగడం ప్రధాన కారణం. మహిళల పని భాగస్వామ్యం గణనీయంగా పెరిగి, కుటుంబ ఆదాయాలను బలోపేతం చేస్తోంది. ప్రభుత్వ పథకాలు, స్థానిక వ్యాపారాల పునర్జననం ఈ మార్పుకు దోహదపడ్డాయి. పట్టణాల్లో సేవా రంగం, రిటైల్ విస్తరణ కూడా ఉపయోగపడ్డాయి. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వ్యక్తుల సాధారణ స్థితి నిరుద్యోగిత రేటు 2017-18లో 6 శాతంగా ఉండగా, 2023-24కు అది 3.2%కి పడిపోయింది. ఈ మార్పు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయనే సంకేతం మాత్రమే కాదు, ఉద్యోగ భద్రతపై ప్రజల నమ్మకం కూడా పెరుగుతోందని సూచిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు పెరగడం కూడా నిరుద్యోగం తగ్గడానికి కారణమయ్యాయి. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పద్ధతిని 2025 జనవరి నుండి మరింత ఆధునికీకరించింది. ప్రస్తుత వారపు స్థితి ఆధారంగా ప్రతి నెల నిరుద్యోగిత అంచనాలను విడుదల చేసే విధానాన్ని అమలు చేసింది. దీనివల్ల ఉద్యోగ మార్కెట్‌లో చోటుచేసుకునే చిన్నచిన్న మార్పులను కూడా ప్రభుత్వం సమయానికి గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం లభిస్తోంది.కొత్త డేటా ప్రకారం.. 15 ఏళ్లకు పైబడిన జనాభాలో నిరుద్యోగం ఆగస్టు 2025లో 5.1శాతంగా ఉండగా, సెప్టెంబర్ 2025లో కొద్దిగా పెరిగి 5.2 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు వరుసగా 4.3 శాతం, 4.6 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఇది అధికంగా 6.7శాతం,6.8శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో పోటీ అధికం కావడం, నైపుణ్యాల మధ్య వ్యత్యాసాలు, వలస కారణాలు వంటి అంశాలు ఈ వ్యత్యాసానికి కారణమవుతున్నాయి. అయితే, కార్మిక మంత్రిత్వ శాఖ చెబుతున్నట్లు, నెలవారీ సంఖ్యలు తరచూ మారుతాయి కనుక వీటిని దీర్ఘకాలిక ధోరణిగా భావించడం తగదు. దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాల్లో ఒకటైన మహారాష్ట్రలో కూడా గత ఆరు సంవత్సరాల్లో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. సాధారణ స్థితిలో నిరుద్యోగిత రేటు 2017-18లో 4.8శాతం ఉండగా, 2023-24లో అది 3.3శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 3.2శాతం నుండి 2.1శాతంకు పడిపోగా, పట్టణ ప్రాంతాల్లో 7.4శాతం నుండి 5.2శాతంకు తగ్గింది. ఇది రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడం, పరిశ్రమల విస్తరణ, మహిళల ఉపాధి పెంపు కార్యక్రమాలు వంటి అంశాలు కలిసి సాధించిన ఫలితం.ఉపాధి అవకాశాలను సృష్టించడం, నైపుణ్యాలను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అందుకే కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు సహా ప్రతి వర్గానికి ఉపాధి అందేలా అనేక పథకాలను అమలు చేస్తోంది. ముఖ్య పథకాలలో స్టార్ట్-అప్ ఇండియా, స్టాండ్-అప్ ఇండియా వంటి కార్యక్రమాలు ఉన్నాయి. ఈ పథకాల ద్వారా లక్షల మందికి స్వయం ఉపాధి, శిక్షణ మరియు ఆర్థిక సహాయం అందుతోంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉద్యోగాలు పెరగడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఎలక్ట్రానిక్స్, మంత్రిత్వ శాఖ కార్యక్రమం ద్వారా ఏఐ, క్లౌడ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికాల్లో నిపుణులను తయారు చేస్తోంది. మహిళలు ఈ రంగంలో ఎక్కువగా చేరేందుకు స్కాలర్‌షిప్‌లు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, కెరీర్-ఓరియెంటెడ్ చొరవలు అమలు చేయబడుతున్నాయి. మహిళల ఉపాధిని మెరుగుపరచేందుకు మహిళా పారిశ్రామిక శిక్షణా సంస్థలు వృత్తి శిక్షణ ఇస్తుండగా, సరస్వతి స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది.

నైపుణ్య మంత్రిత్వ శాఖ ప్రారం భించిన కార్యక్రమం మహిళలకు టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు పెద్ద అవకాశాన్ని ఇస్తోంది. అదనంగా, మిషన్ శక్తి కింద అంగన్‌వాడీ-కమ్-క్రీచ్ కేంద్రాలను విస్తరించి తల్లి పనిచేసే మహిళలకు పిల్లల సంరక్షణ సదుపాయం కల్పిస్తున్నారు. 16-18 ఏళ్ల బాలికలకు నవ్య పథకం ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు.ప్రధాన మంత్రి వీక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ఇఎల్ఐ పథకాన్ని అమలు చేశారు. దీని కోసం రూ. 99,446 కోట్ల భారీ ఆర్థిక వ్యయం. ఉద్యోగార్థులకు ఉద్యోగ సమాచారం, కౌన్సెలింగ్, నైపుణ్య కోర్సుల వివరాలను అందించేందుకు పోర్టల్ ఒకే-చోటు వేదికగా పనిచేస్తోంది. 25 ప్రత్యేక ఔఉ కేంద్రాల ద్వారా ఉద్యోగార్థులకు ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ, కౌన్సెలింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు అందిస్తున్నారు. అదనంగా దక్ష పథకం ద్వారా ఎస్సీ, ఓబీసీలు, వ్యర్థాలను తీసేవారికి మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాల శిక్షణ అందిస్తున్నారు. సామాజిక భద్రతా కోడ్ 2020లో మహిళా ఉద్యోగుల కోసం 26 వారాల చెల్లింపు ప్రసూతి సెలవు, 50 మందికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో క్రెచ్ సౌకర్యం వంటి ముఖ్య నిబంధనలు ఉన్నాయి. అలాగే ౠఉఈ కోడ్ ప్రకారం మహిళలు ఏ పనులకైనా నియమించబడొచ్చు. అయితే రాత్రిపూట పనిచేయాల్సి వచ్చినప్పుడు భద్రతా చర్యలు, ప్రయాణ సదుపాయాలు, వారి సమ్మతి తప్పనిసరి. కేంద్ర బడ్జెట్ 2024?25లో పరిశ్రమల దగ్గర మహిళా హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పలు రంగాల్లో పనిచేసే మహిళలకు క్రెచ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా వారి పని-జీవితం సంతులనం సులభం అవుతుంది.




# నానో టెక్నాలజీ
# ఏమి బోధిస్తున్నారు...? ఎవరు బోధిస్తున్నారు....?

**అనంతపురం - సూర్య వాస్తవం**

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం లో చాలా కోర్సులకు ఇంతవరకు ప్రత్యేక విభాగాలు లేవు. ముప్పై సంవత్సరాల కిందట ప్రవేశపెట్టిన ఎంసిఏ కోర్సు ఇప్పటివరకు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో అక్కడి ఫ్యాకల్టీ దయాదాక్షిణ్యాల మీద నడుస్తోంది. వీటికి శాశ్విత అధ్యాపకులను విభాగాన్ని నెలకొల్పమని ఉన్నత విద్య లేదా ఏఐసిటిఈ కి ప్రతిపాదనలు పంపలేదు. అలాగే నానోసైన్స్ నానో టెక్నాలజీ కోర్సులు కెమికల్ ఇంజినీ రింగ్ విభాగ పర్యవేక్షణలో ఉన్నది. ఎంసీఏ, ఎంటెక్ నానోటెక్నాలజీ ప్రోగ్రామ్‌లు స్వతంత్ర కాకుండా వేరే విభాగాల పర్యవేక్షణ ఉండటం ఆక్షేపణీయం. ఇదివరకు ఎంబీఏ కూడా మెకానికల్ విభాగం ప్రొఫెసర్ చూసేవారు. ఇలాంటి నిర్ణయం ప్రోగ్రామ్ విశ్వసనీయత వృద్ధికి ఆటంకం కలిగించే ప్రాథమిక అసమతుల్యతను ప్రతిబింబిస్తుందని అక్కడ విద్యార్థులు అధ్యాపకులు వాపోతున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్ రంగాలలో సంబంధితంగా ఉండటానికి ప్రయత్నిస్తున్న రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఎదుర్కొంటున్న విస్తృత ఒత్తిళ్లకు ఈ వివాదం వెలుగునిస్తుంది. నానోటెక్నాలజీఅణువులు అణువుల స్థాయిలో పరిశోధన, లక్ష్యంగా చేసుకున్న ఔషధ డెలివరీ నుండి సెమీకండక్టర్ సూక్ష్మీకరణ వరకు ప్రతిదానినీ పునర్నిర్మించడం. ప్రపంచవ్యాప్తంగా, ఇటువంటి కార్యక్రమాలు సాధారణంగా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం లేదా మెటీరియల్ సైన్స్‌లో ప్రత్యేకత కలిగిన విభాగాలలో ఉంటాయి. అయితే, నానోటెక్నాలజీ కెమికల్ ఇంజనీరింగ్ కింద ఉంది. "ఇది మైక్రోచిప్‌లను చేయమని కమ్మరిని అడగడం లాంటిది" అని విద్యాపరిరక్షణ కన్వీనర్ ప్రొఫెసర్ యం. సురేష్ బాబు తెలిపారు. యూనివర్సిటీ నిర్వాహకులు ఈ చర్య ఉద్దేశపూర్వకంగానే జరిగిందని, ఏకపక్షంగా కాదని నొక్కి చెబుతున్నారు. కెమికల్ ఇంజినీరింగ్ పాఠ్యాంశాలు రసాయన సంశ్లేషణ, పదార్థాల నిర్వహణ ప్రయోగశాల ప్రోటోకాల్‌లను కవర్ చేస్తాయి, ఇవి నానో శాస్త్రవేత్తలకు శిక్షణ ఇవ్వడానికి పని చేయగల ఆధారాన్ని అందిస్తాయని విశ్వవిద్యాలయం అధికారులు భావిస్తున్నారు. 2008లో జేఎన్టీయూ విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో కనిపించే విస్తృత నమూనాను ఈ చర్చ ప్రతిధ్వనిస్తుంది.

ఆఫర్‌లను విస్తరించే తొందరలో, ఖర్చును తగ్గించడానికి అనేక క్యాంపస్‌లు ఉద్భవిస్తున్న ప్రోగ్రామ్‌లను ఇప్పటికే ఉన్న విభాగాలలో కలుపుతున్నాయి.

"సరైన మౌలిక సదుపాయాలు లేదా శిక్షణ పొందిన అధ్యాపకులు లేకుండా, ఈ కార్యక్రమం నానోటెక్నాలజీ ని నిర్వీర్యం చేసి ఎందుకు పనికిరాని గ్రాడ్యుయేట్లను తయారు చేసే ప్రమాదం ఉంది అని పౌర స్పందన వేదిక నాయకులు ప్రొ జీ. వెంకట శివారెడ్డి అన్నారు. నానో టెక్నాలజీ లో నానో సెన్సార్స్, డిటెక్టర్స్, మెమ్స్, నెమ్స్, ఫిజియోకెమికల్ మెథడ్స్, ఇమేజింగ్ టెక్నిక్స్, లిథోగ్రాఫి, నానో ఫ్యాబ్రికేషన్ మైక్రోస్కోపి నానో మెట్రాలజీ చెప్పే నాథుడు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు లేక తలపట్టుకుంటున్నారు. పేరులో ఆధునికత, సిలబస్ రూపకల్పనలో అంశాలు పెట్టడం కాదు బోధించే వారు లేకపోతే ఎంతటి గొప్ప చదువైనా వ్యర్థం. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడక ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఏపీలో టీడీపీ కొత్త అధ్యక్షులు వీరే...

**విజయవాడ - సూర్య వాస్తవం**

పార్టీ సంస్థాగత నిర్మాణంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. అందులో భాగంగా చాలా రోజుల నుంచి ఆలస్యమవుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుల ఎంపికపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొంతమందిని టీడీపీ జిల్లా అధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ అంశం మీద వారికి సమాచారం అందించినట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అప్పుడే ఎన్నికల మూడ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ అనంతరం.. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 18 నెలలు పూర్తౌంది. ఒకటిన్నర సంవత్సరం పదవీకాలం పూర్తికాగా.. మరో మూడు సంవత్సరాలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉన్నప్పటికీ.. 2024 సీన్ మరోసారి రిపీట్ చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అందుకు అనుగుణంగానే టీడీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అలాగే పార్టీని ఇప్పటి నుంచే లైన్‌లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా



ఇప్పటికే గ్రామ, వార్డు, నగరం, మండల, పట్టణ కార్యవర్గాల ఎంపిక పూర్తికాగా.. టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం మాత్రం ఆలస్యమవుతూ వస్తోంది.టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం కోసం త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసిన చంద్రబాబు.. త్రీమెన్ కమిటీల క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం కమిటీలు నివేదించిన రిపోర్టులను పరిశీలించినట్లు సమాచారం. అలాగే తన సొంత సర్వే రిపోర్టుల ఆధారంగా జిల్లా అధ్యక్షుల ఎంపికపై చంద్రబాబు ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. మొత్తంగా టీడీపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక దాదాపుగా పూర్తౌందని సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే తాజాగా టీడీపీ జిల్లా అధ్యక్షులుగా కొంతమంది పేర్లు దాదాపుగా ఖరారైనట్లు ఓ జాబితా బయటకు వచ్చింది. ఈ మేరకు టీడీపీ అధిష్టానం నుంచి వారికి సమాచారం అందినట్లు తెలిసింది. త్వరలో పార్టీ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు సమాచారం.బాపట్ల జిల్లాకు సలగల రాజశేఖర్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీధర్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా రేచర్ల వెంకటేశ్వరరావు, నంద్యాలకు సుబ్బారెడ్డి, అనంతపురం కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంఎస్ రాజు, తిరుపతి జిల్లా పనబాక లక్ష్మి, చిత్తూరు జిల్లా షణ్ముగం, ప్రకాశం ఉగ్రనరసింహారెడ్డి, విజయనగరం కిమిడి నాగార్జున, రాజంపేటకు సుగవాసి ప్రసాద్ పేర్లను దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం.కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా జ్యోతుల నవీన్, ఏలూరు జిల్లా బడేటి చందు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనురాధకు అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా జిల్లా అధ్యక్షులను నియమిస్తోంది టీడీపీ అధిష్టానం. వీరి ఎంపికపై త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

# చంద్రబాబు మారినట్టేనా



### ఏమైంది.. ఆ నాటి దూకుడు

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995 నాటి నుంచి 2025 వరకూ ఏ మాత్రం రాజకీయంగా మారలేదు. ఆయన రాజకీయ నిర్ణయాలను వేగంగా తీసుకోలేకపోతున్నారని సొంత పార్టీ నేతలే అంటుంటారు. వేగంగా నిర్ణయాలు తీసుకోకపోవడం ఒకరకంగా చంద్రబాబు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే అనేక సార్లు టీడీపీ ఓటమి పాలయింది. అయినా సరే చంద్రబాబు నాయుడు వ్యవహారశైలిలో మార్పు రాలేదు. గతంలో తక్కువ నియోజకవర్గాలు ఉన్నప్పుడు అదే తీరు. ఇప్పుడు 98 శాతం స్ట్రయిక్ రేట్ ఇచ్చినప్పటికీ అదే రకంగా వ్యవహరిస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు స్వతహాగా పార్టీ పరంగా క్విక్ డెసిషన్ తీసుకోలేరు.ఇందుకు ఉదాహరణ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వర్సెస్ ఎంపీ కేశినేని చిన్ని వర్గం మధ్య చిచ్చు చల్లారలేదు. ఎన్ని సార్లు వార్నింగ్ లు ఇచ్చినా తిరువూరు పంచాయతీకి తెరపడలేదు. తాజాగా వరుస పోస్టులతో ఎంపీ వర్గానికి ఎమ్మెల్యే కొలికపూడి నిద్రలేకుండా చేస్తున్నారు. ఇటీవల కొలికపూడి ఓ మహిళతో ఉన్న ఫోటోను టిడిపి నేతలు విడుదల చేయడం టిడిపి సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. కౌంటర్ గా ఇద్దరు నేతల ఫోటోలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పోస్టు చేశారరు. తిరువూరుకు చెందిన బుడ్డయ్య , చెరుకూరి రాజేశ్వరరావులు మహిళలతో ఉన్న ఫోటోలను విడుదల చేసిన కొలికపూడి రాజేశ్వరరావు ఇల్లు కూడా చూస్తారా...? అంటూ పోస్టులు పెట్టారు. దీంతో కొలికపూడి పై ఎంపీ చిన్ని వర్గం రగిలిపోతుంది. ఏఐ ఫోటోలు విడుదల చేశారంటూ ఎంపీ కేశినేని చిన్ని వర్గం మండిపడుతుంది.మరొకవైపు నెల్లూరుతో పాటు మిగిలిన ప్రాంతాల్లో వైసీపీ నేతలను పార్టీలో చేర్చుకోవడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది కాలం కూడా లేని పదవుల కోసం ఇతర పార్టీల నుంచి నేతలను తీసుకు వచ్చి అప్పటి వరకూ పనిచేసిన వారికి ఇబ్బందులు పెడతారా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది. గతంలో వైఎస్ జగన్ కూడా ఇలాగే చేసి సొంత పార్టీ క్యాడర్ నుంచి అసంతృప్తిని ఎదుర్కొన్నారు. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే గడువు ఉంది. ఈ సమయంలో వైసీపీ నుంచి నేతలను అరువు తెచ్చుకుని తమపై రుద్దుతారా? అని నెట్టింట తెలుగు తమ్ముళ్లు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద నాటికి.. నేటికి చంద్రబాబు రాజకీయ నిర్ణయాల్లో మాత్రం మార్పు లేదన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న మాట.

## భక్తి శ్రద్ధలతో ముగిసిన భాగవత పఠనం



**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** యల్లనూరు మండలం తిమ్మమ్మపల్లిలో కొలువై ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తహ పఠనం బుదవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది. పై కార్యక్రమాలు సుగుమంచిపల్లి చెందిన శివ శ్రీనివాసుల నాయుడులు కలిసి గోపూజను శాస్త్రోత్రంగా వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ శాసన సభ్యులు కేతిరెడ్డి సతీమణి రమాదేవి గోపూజలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వ హించారు. వాటిలో భాగంగా అమ్మవారి కలశంలో గ్రామ పురవీధులలో భక్తిశ్రద్ధల మధ్య ప్రదర్శనం నిర్వహించారు. గ్రామంలో పండగవాతావారణం నెల కొంది, ఏడు రోజుల పాటు ఉదయం అల్పాహారం రెండు పూటల అన్నప్రసాద వితరణ చేసిన గ్రామస్థులకు దాతలకు కమిటీ వారికి గ్రామపెద్దలకు భజన మండలి సభ్యులకు, సేవకులకు భాగవత సమాజం పాలకవర్గం వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం భాగవతపండితులు తదితరులకు కాషా య శాలవాలతో ఘన సత్కారం చేసారు. ఈ కార్య క్రమంలో సమాజం అధ్యక్షులు కర్ణ రామకంచిరెడ్డి, ఉపాధ్యక్షులు నరేంద్ర నాయుడు, సుధాకర్ నాయుడు, మీడియా కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి పెద్దారెడ్డి, బాల పుల్లయ్య, పెద్దన్న చిన్న సుబ్బయ్య, సుధాకర్ నాయుడు, పట్టగిత్తపల్లి శ్రీనివాసులు, వైఎస్ఆర్ కడప ఉభయ జిల్లాల భాగవత పండితులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ కార్యాలయంలో

## వైఎస్ షర్మిల రెడ్డి 51 జన్మదిన వేడుకలు

### - రక్తదానం నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మూలం ధ్రువ కుమార్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** పులివెందుల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి 51వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మూలం ధ్రువ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్ షర్మిల చిత్రపటానికి మూలం ధ్రువకుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల అధ్యక్షుడు శివ కళ్యాణ్ రెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షుడు బోనాల ఖాదర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయ, ఉపా ధ్యక్షుడు చంద్రబాబు లు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేసి, అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ తన సిబ్బందితో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ధ్రువ కుమార్ రెడ్డి మరి కొందరు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్ షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బలపడుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నడిచిన అడుగు జాడలలో నడిచిన షర్మిలారెడ్డి అడుగుజాడలలో మేము కూడా నడుస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, రాష్ట్రం లోనూ అధికారంలోకొస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేముల అధ్యక్షులు వెంకటేష్ బాబు, రాష్ట్ర మైనారిటీ సెక్రటరీ మాబు, జిల్లా జాయింట్ సెక్రటరీ సాయికుమార్ రెడ్డి, పులివెందుల ముస్లిం మైనార్టీ సెక్రటరీ అబ్దుల్ సమ్మద్, వైద్య సిబ్బంది టెక్నీషియన్ రఫీ స్టాఫ్ నర్స్ లత బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ రజిని, బ్లడ్ బ్యాంక్ అటెండర్ వెంకట శివయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష పూజలు



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోటి సమాధి వద్ద కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి మధు గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పథకం నుండి

# గాంధీ పేరును తొలగించడం దుర్మార్గం

- ఉపాధి హామీ పథకం నూతన మార్గదర్శకాలు రాష్ట్ర ప్రభుత్వాలకు పెను ఆర్థిక భారం
- మోడీ ప్రభుత్వానికి పోగాలం దాపురించింది.
- మోడీ ప్రభుత్వ పతనానికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** మోడీ ప్రభుత్వానికి పోగాలం దాపురించిందని, పతనానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని, అందువల్లనే విపరీత బుద్ధులు పుట్టాయని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును మోడీ ప్రభుత్వం తొలగించినందుకు నిరసనగా వేంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పల్లె ప్రజల పాసుపతాస్త్రమని ,ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ పథకం అని, దీనిని 2005లో సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో మన్మోహన్ సింగ్ గారు ప్రధానమంత్రిగా కాంగ్రెస్ నేతృత్వంలో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది అని, అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తులసి రెడ్డి వివరించారు . పూజ బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఉపాధి హామీ పథకం నెరవేరుస్తున్నందున ఈ పథకానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని 2009లో పేరు పెట్టడం జరిగింది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 90%, రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులు భరించే విధంగా మార్గదర్శకాలు రూపొందించడం జరిగింది .గత 16 సంవత్సరాలుగా ఇదే పేరుతో ఇవే మార్గదర్శకాలతో అమలవుతోంది. కానీ దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడం, కేంద్ర ప్రభుత్వం 90 శాతం బదులు 60 శాతం మాత్రమే నిధులు భరించే విధంగా మార్గదర్శకాలను మార్చడం దురదృష్టకరం. మహాత్మా గాంధీ జాతిపిత. ప్రపంచ నాయకుడు ఆయన పేరే ఒక తారక మంత్రం. గర్వకారణం. అటువంటి మహాత్మా గాంధీ పేరును ఈ పథకం నుండి మోడీ ప్రభుత్వం తొలగించడం అత్యంత దురదృష్టకరం. ఇది మహాత్మా గాంధీని అవమానించడం అవుతుంది. రాబోవు రోజుల్లో ఈ పథకం రాష్ట్రాలకు పెను ఆర్థిక భారం కానుంది .ఈ మార్పులకు తెలుగుదేశం పార్టీ ,జనసేన పార్టీ మద్దతు ఇవ్వడం అత్యంత శోచనీయం .ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చే విధంగా కొనసాగించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు .రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధినేతలని భారత దేశపు పొలిమేరల నుండి తరిమికొట్టిన నాయకుడు మహాత్మా గాంధీ .ఆయనతో పెట్టుకుంటే ఆంగ్లేయులకు పట్టిన గతే మోడీ ప్రభుత్వానికి పడుతుందని తులసి రెడ్డి హెచ్చరించారు .అదే సమయంలో మోడీ ప్రభుత్వానికి గుడ్డిగా మద్దతిస్తున్న తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలకు కూడా పతనము తప్పదని తులసి రెడ్డి హెచ్చరించారు .నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం ,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలాని భాష,జిల్లా జాయింట్ సెక్రెటరీ సాయికుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, వేమా రాజా, వేమయ్య, బద్రీనాథ్, రాఘవయ్య, బ్రహ్మం, లక్కిరెడ్డి చెన్న కృష్ణారెడ్డి, వినయ్, శివ, కువైట్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న తులసి రెడ్డి



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** వేంపల్లి చర్చి అఫ్ క్రైస్ట్ దైవజనులు రవికుమార్, వనజ కుమారి దంపతుల కుమారుడు ప్రవీణ్ కుమార్ వివాహం కడప నగరం చిన్న చౌక్ కు చెందిన ప్రతిభతో బుధవారం వేంపల్లిలో మధు రెడ్డి కళ్యాణమండపంలో వైభవంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, బుల్లెట్ రాజా, వినయ్, సత్తార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ సంబంధాలలో వివాహ బంధం అతి పవిత్రమైనదని, ఆ బంధానికి పెళ్లి చట్టబద్ధత, సామాజిక భద్రత కల్పిస్తుందన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన ఆర్‌సిడిఎస్, నియోజకవర్గ అధ్యక్షులు



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** పులివెందుల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవీంద్ర జువెలర్స్ ప్రోపరేటర్ నాగరాజు దుకాణానికి సంబంధించిన 2026 క్యాలెండర్లను పులివెందుల ఆర్సిడిఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ధ్రువ కుమార్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీంద్ర జువెలర్స్‌లో వెండి, బంగారు నగల వ్యాపా రం చేసేవారి కోసం 2026 జనవరి క్యాలెండర్లను తయారు చేయించడం జరిగిందన్నారు. దుకాణానికి వచ్చే కస్టమర్లకు ఈ క్యాలెండర్లను నాగరాజు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. నాగరాజు వ్యాపార అభివృద్ధి దినం దినానికి మరింత పెరగాలని వారు ఆకాంక్షించారు.

### లోయోలా డిగ్రీ కాలేజ్‌లో

## గ్రీన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం

**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పులివెందులలో లోయోలా డిగ్రీ కాలేజ్‌లో డిసెంబర్ నెల ఎస్ఏఎస్ఏ, కార్యక్రమంగా "గ్రీన్‌ఎంట్రప్రెన్యూర్" కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన 26 ఫుడ్ స్టాళ్లు, 8 ఫన్ గేమ్స్ స్టాళు ,, 6 హ్యాండ్‌క్రాఫ్ట్ స్టాళ్లతో పాటు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ డా.జోజి రెడ్డి మాట్లాడుతూ, నేటి సమా జంలో ఎంట్ర ప్రెన్యూర్‌షిప్ ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులను ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ ప్రదాతలుగా తయారు చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్య క్రమాన్ని ప్రిన్సి పాల్ డా.జోజి రెడ్డి ప్రారంభించగా, వైస్ ప్రిన్సిపాల్ చి. వన్న, ఎస్ఏ ఎస్ఏ కోఆర్డినేటర్ హిమాజ, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యా ర్థులు, సిబ్బంది ఉత్సాహభరితంగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు.





## జాతీయ పెన్షనర్స్ డే అసోసియేషన్ సర్వసభ్య సమావేశం




**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పులివెందుల పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా 17- 12-2025 బుధవారము ఉదయము 10 గంటలకు పెన్షనర్స్ భవనం నందు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏవీ గోపాల్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వీరు తమ ప్రసంగంలో హెల్త్ కార్డులకు లభించే వైద్య సదుపాయాలు ,ఎంత వార్షిక ఆదాయం( 12,75,000)ఉన్నవారు ఇన్కమ్ టాక్స్ పరిధిలోకి వస్తారు. ఎవరెవరు ఈ ఫైలింగ్ చేయాలి అనే విషయాలను గురించి వివరించారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగస్తులు అందరూ అసోసియేషన్‌లో సభ్యులుగా చేరవలసినదిగా కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన పులివెందుల ఎస్. టి .ఓ తమ ప్రసంగంలో పెన్షనర్లకు ఏమైనా సమస్యలు ఉంటే అసోసియేషన్ తరపున తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరి స్తామని సభాముఖంగా చెప్పారు. అసోసియేషన్ సెక్రటరీ శ్రీదేవి రెడ్డి కొండారెడ్డి ఫ్యామిలీ పెన్షనర్లకు ఎవరికైనా 70 సంవత్సరాలు వయసు నిండి ఉంటే అటువంటివారు అడిషనల్ క్వాంటం కొరకు వెంటనే దరఖాస్తు చేసుకొన వలసినదిగా సూచించారు. సారెడ్డిచంద్రశేఖర రెడ్డి డి.ఎస్ నకరా న్యాయ పోరాటం ఫలితంగా బుధవారం పెన్షన్ పొందుతున్నామని చెప్పారు. అసోసియేషన్ కోశాధికారి కె.నారాయణరెడ్డి జమా ఖర్చులను సభ ముందు ఉంచారు. ఈ సమావేశంలో 70, 80, 90 సంవత్సరాల వయస్సు నిండిన 20 మంది పెన్షనర్లకు ఘనంగా సన్మానం చేశారు. సమావేశానికి 100 మంది పెన్షనర్లు హాజరు కావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహా అంబులం పూజ

### - అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన వై.యు రామాంజనేయులు గృహం
### - 18వ తాంత్రిక పూజతో పరవశించిన అయ్యప్పలు



**పామిడి– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పామిడి గుప్తా కాలనీలో మాజీ వార్డ్ కౌన్సిలర్ వై.యు. రామాంజనేయులు ఇంటిలో నిర్వహించిన మహా తాంత్రిక అంబులం పడిపూజ కార్యక్రమానికి నంబుద్రి ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప నామస్మరణతో మారు మోగించారు. నంబుద్రి ప్రసాద్ గురుస్వామి పామిడి ప్రసాద్ గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అంబులం పూజను అయ్యప్ప మాలధారణ భక్తులుతో కలిసి అయ్యప్ప భజనలతో మారు మోగిన గుప్తా కాలనీ, స్వాములు కలసి అయ్యప్ప స్వామి విగ్రహానికి స్వాముల ఆధ్వర్యంలో అభిషేకం పూజలు నిర్వహించి, స్వామి వారికి పూజాధి కార్యక్రమాలు చేసి, స్వామియే శరణమయ్యప్ప అంటూ మాలాధారణ భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.అనంతరం అయ్యప్ప భక్తులకు వై యు రామాంజనేయులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదానాలను స్వీకరించారు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు శివ స్వాములు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పొలాల సందర్శన






**లింగాల – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పులివెందులలో ఐదు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. వాటిలో భాగంగా రెండవ రోజు పొలాల సందర్శనలో బుధవారం లింగాల మండలంలోని అక్కులుగారిపల్లి, చిన్న కుడాల గ్రామాలలో ఐదవ బ్యాచ్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 60 మంది క్యాడర్‌లకు ఆర్‌డిఎస్, ఏ గ్రేడ్ క్వాలిటీ ఇన్పుట్స్ మీద పెద్ద మొత్తంలో డెమోలు ఘనజీవమృతం 500 కేజీలుఅక్కులు గారిపల్లి ఐసిఆర్‌పి యశోదమ్మ తయారు చేసి చూపడం జరిగింది. అదేవిధంగా ఏటిఎమ్ మోడల్ను చిన్న కుడాల మోహన్ రెడ్డిల పొలంలో వేయడం జరిగింది. ఫీల్డ్ స్థాయి అందరూ దీనిని క్షుణ్ణంగా పరిశీలించి నేర్చుకున్నారు. అదే విధంగా విశ్వేశ్వర రెడ్డి అక్కులు గారి పల్లి అనే రైతు ప్రధాన పంట చీని 6 ఎకరాల్లో ఐదు సంవత్సరాలుగా పిఎమ్‌డిఎస్ –ఆర్‌డిఎస్‌లు వేస్తున్నారూ, ఈ రైతు అనుభవం ఎప్పుడు రబి డ్రై షోయింగ్ అవలంచిచారు అన్నది రైతు వివరించారు. అక్కడ రైతులు, సిబ్బంది గమనించిన అంశాలపై వివరణ భూమి లో నీటి వినియోగం తగ్గింది నీటిని పట్టి ఉంచేనేల స్వభావం బాగా ఉన్నది, అదే విదంగా భూమి బాగా గుల్లబారి కార్బనశాతం పెరిగి ఉన్నది అని తెలియజేస్తూ ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల స్థూల, సూక్ష్మ పోషకాలు బాగా ఉన్నాయి అని గమనించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఏ నరసింహారెడ్డి, యూనిట్ ఇన్చార్జి జయ నాయక్, ఐసిఆర్ పోలు పి.రవి, యశోద, వి.జయలక్ష్మి రైతు మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, బిఆర్‌సి ఓనర్ ఉదయ్ కృష్ణారెడ్డి, శివరంజని, 5వ బ్యాచ్ సిబ్బంది, విహెచ్‌ఏ రైతులు, హాజరయ్యారు.

## సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుందాం
## - విరిజానంద స్వామీజీ



**పామిడి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** హిందూ ధర్మం గొప్పతనం, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బ్రాహ్మంగారి మట్టం అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరిజానంద స్వామీజీ అన్నారు. మండల పరిధిలోని దేవరపల్లి గ్రామ సమీపన ఉన్నా దొడే ఓబులేసు దేవాలయం నందు బుధవారం సాయంత్రం హిందూ ధర్మ సమ్మేళన సదస్సు జరిగింది. కార్యక్రమానికి చుట్టూ ప్రక్క గ్రామాల భక్తాదులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో అన్ని ధర్మాల కన్నా ముందు హిందూ ధర్మం పుట్టిందన్నారు. హిందువులు ధర్మ కర్తవ్యం తీసుకోవాలని, ధర్మ యుద్ధం చేసే సమయం ఆసన్నమైందన్నారు. వందేళ్లుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో స్వయం సేవకులు దేశభక్తితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దేశంలో మతమార్పిడులు ఆపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం పండుగ నిర్వహించారాని భక్తులు కొనియాడారు. భక్తధులకు అన్నప్రాసదలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ బంధువులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా
## వెన్నుపూస రామ్మోహన్ రెడ్డి



**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా వెన్నుపూస రామ్మోహన్ రెడ్డి (బాబు) నియమితులైనట్లు వైసిపి పార్టీ శ్రేణులు తెలిపారు. ముందుగా రామ్మోహన్ రెడ్డికి సింహాద్రి పురం మండలం వైసిపి నాయకులు దృశ్యాలువతో సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి దేవి రెడ్డి శివ శంకర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీలో భాగంగా పలు నియామకాలను ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్సీపీ రైతు విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెన్నుపూస రామ్మోహన్ రెడ్డి నియమితుల య్యారని అన్నారు. తనపై నమ్మకం ఉంచి కల్పించిన పదవికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధి లక్ష్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. 2029లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేంతవరకు కార్యకర్తలు నాయకులను సమన్వయ పరచుకుంటూ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. అనంతరం వైసిపి నాయకులు అభిమానులు ముల్లా మహమ్మద్, నజీర్, షబ్బీర్, గౌస్, బహదూర్ , ముల్లా బిలాల్ , గౌస్ పీర్, మాబు, ఆసీఫ్, నుమైర్, సురేష్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయండి

**- అంగన్వాడీ వర్కర్లకు ఎమ్మెల్యే కందికుంట సూచన**
**- వర్కర్లకు 5జి సెల్ ఫోన్లు ప్రీస్కూల్ కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**






**కదిరి– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పసిబిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన 5జి సెల్ ఫోన్ల పంపిణీతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు ఫ్రీ స్కూల్ కిట్లను కూడా ఎమ్మెల్యే అంగన్వాడీ వర్కర్లకు పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే కి సిడిపిఓ రాధికతో సూపర్వైజర్లు అంగన్వాడి యూనియన్ నాయకురాళ్లు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. సిడిపిఓ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో పారదర్శకత ఉండాలని ఉద్దేశంతో అన్ని శాఖలలో మౌలిక వసతులను కల్పిస్తూ బలోపేతం చేస్తోందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేసి కేంద్రాల్లో పసిపిల్లలకు మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ముందుకు వెళుతొందన్నారు. అందులో భాగంగానే టెక్నాలజీని మరింత దగ్గర చేయాలని ఉద్దేశంతో 5జి సెల్ఫోన్లను అందుబాటులోకి తెచ్చి స్త్రీ శిశు సంక్షేమ శాఖ తరపున చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనె ఉద్దేశంతోటి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సెల్ ఫోన్లో ద్వారా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు మరింత దగ్గరగా తీసుకెళ్లి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల తో పాటు హెల్పర్ల సమస్యలను గాలికి వదిలేసి తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో అప్పట్లో మీరు కూడా రోడ్డు ఎక్కారని అప్పట్లో మీకు తమ వంతు మద్దతు తెలిపామని వర్కర్లను ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మీరు కూడా మరొకసారి రోడ్డు మీదకి రావాలని చూశారని అన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉన్నప్పటికీ మీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తోందన్నారు. అయినప్పటికీ టెక్నాలజీని మీకు అందుబాటులోకి తెస్తూ మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ మీ జీవితాలలో కొంతవరకు వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ మీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం దోహదపడుతొందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా మీకు అనుగుణంగా మీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరి ంచడానికి తన వంతు కృషి చేస్తుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చాలా అనుభవం ఉందని ఆయనకు మీ కష్టాలు కన్నీళ్లు అన్ని తెలుసని మీ కోరికలు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారని కూడా భరోసా ఇచ్చారు. అన్ని వ్యవస్థలను పాలన పారదర్శకంగా ఉండాలని ఉద్దేశంతో స్త్రీ సంక్షేమ శాఖ లో కూడా పారదర్శక పాలనను తీసుకురావాలని అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు పెడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి వారికి సకాలంలో సరైన న్యాయం చేయాలని ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మీరు కూడా బాధ్యతగా విధులు నిర్వహించాలని అక్కడక్కడ కొన్ని అవకతవకలు జరగడం సర్వసాధారణం అన్నారు. 5జీ సెల్ ఫోన్ ద్వారా అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలకు వారి తల్లిదండ్రులకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. సాధారణంగా అన్ని శాఖలలోనూ పని దొంగలు ఒకటి రెండు శాతం ఉంటారని అలాంటివి సర్వసాధారణమని అన్నారు అయితే ఎంతో నమ్మకంగా అంగన్వాడీ కేంద్రాలకు పసిబిడ్డలను పంపించినప్పుడు వారి బాగోగులను చూసు కోవాల్సిన కనీస బాధ్యత మీ పైన ఉందని అంగన్వాడి వర్కర్లకు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనంతరం వర్కర్లకు 5జీ సెల్ ఫోన్‌లను ఫ్రీ స్కూల్ కిట్లను పంపిణీ చేసి మినీ అంగన్వాడి కేంద్రాల నుంచి మెయిన్ అంగన్వాడి కేంద్రాలకు అప్గ్రేడ్ అయిన వర్కర్లకు నియామక పత్రా లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేఎస్ బహువుద్దీన్, కృష్ణమూర్తి, సూపర్వైజర్లు నిహారిక, మమత, దీప, జయశ్రీ, నరసమ్మ, అలివేలమ్మ, సిబ్బంది చంద్రమోహన్, శోభ, కళ్యాణి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ప్రమీల, విజయభారతి, సుజాత, లక్ష్మి, రామలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అణు శక్తి వినియోగం - అభివృద్ధిపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చ

**- యురేనియం కార్పొరేషన్‌పై పార్లమెంటులో గళమెత్తిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** సుస్థిర అణు శక్తి వినియోగం, అభివృద్ధి బిల్లుపై బుధవారం పార్లమెంటులో సుదీర్ఘ చర్చ కొనసాగగా అణు ఆవశ్యకతను వివరిస్తూనే తన నియో జకవర్గ పరిధిలో యుసిఐఎల్ యాజమాన్యం వ్యవహరి స్తున్న తీరును పార్లమెంట్ వేదికగా పలు అంశాలను లేవనెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక యురే నియం నిల్వలు కడప పార్లమెంటు నియోజకవర్గంలో కలవని గత 18 సంవత్సరాలుగా నియోజ కవర్గంలోని తుమ్మలపల్లిలో యురేనియం కార్పొరేషన్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంటు నిర్వహణ కొరకు జాతీయ అవసరాల నిమిత్తం ఆరు గ్రామాలకు చెందిన మా ప్రజలు తమ భూములను కోల్పోయారని, యురేనియం వల్ల తీవ్రమైన రేడియేషన్ సమస్యలు వస్తాయన్న ప్రచారం ఉన్నా వాళ్లు తమ భూములను అందించి త్యాగాలు చేశారని, యురేనియం కార్పొరేషన్ అక్కడి ప్రజలపై ఎటువంటి గౌరవం కానీ మరియు వారి సమస్యలు, ఫిర్యాదుల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి చూపడం లేదని, టెయిలింగ్ పాండ్‌లోకి ప్రమాదకర మైన రసాయనాలు పంపుతున్నారని సంబంధిత మంత్రి దృష్టికి గతంలోనే తీసుకురావడం జరిగిందని, టెయిలింగ్ పాండ్ ఉన్న కొట్టాల గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి వేరే చోటికి షిఫ్ట్ చేయాలని మంత్రికి గతంలోనే విన్నవించడం జరిగిందని, అంతే కాకుండా భూసేకరణ, భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చే అంశంలో ఇంకా సమస్యలు అలానే ఉన్నాయని, అక్కడ వారి ఆరోగ్య సమస్యలను కూడా లెక్కచేయకుండా భూములిచ్చిన రైతులు, ప్రజల త్యాగాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను తక్ష ణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తప్పక నిర్వహించాలి

**లక్కిరెడ్డిపల్లి– సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** ప్రతి ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తప్పకుండా నిర్వహించాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై రెండు రోజులు శిక్షణా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ....సచివాలయ సిబ్బంది పంచాయతీ సెక్రెటరీ ప్రతి ఇంటికి వెళ్లి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే యాప్ లో ఇంటి యజమాని ఇంట్లో ఎంతమంది ఉన్నారన్న విషయాలు నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఈ యాప్‌లో వివరాలు సక్రమంగా పొందుపరిస్తే ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్ అండ్ ఎడ్యుకేషనల్ సహాయకులు తేజస్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు ఉషారాణి, నాగేంద్ర వరప్రసాద్ బాబు, పంచాయతీ సెక్రెటరీ నరసింహుడు, నాగమణి, రజనీష్ రెడ్డి, వెంకటయ్య, సిరిబాబు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## కోర్ కమిటీ సమావేశ కార్యక్రమం మండల అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** సింహాద్రి పురం మండలం బలపనూరు గ్రామంలో మండల అధ్యక్షుడు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కోర్ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో (అబ్జర్వర్లు) మాజీ నెట్ క్యాంప్ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, వెన్నపూస సుద ర్శన్ రెడ్డి, వేలుగోటి చంద్రశేఖర్ రెడ్డి,ప్రకాష్ రెడ్డి రాంగోపాల్ రెడ్డి కేశిరెడ్డి కాకర్ల శ్రీనివాస్ రెడ్డి కాకర్ల చలమారెడ్డి ఏడుగురి శ్రీనివాసరెడ్డి రాచమల్లు శ్రీనివాసరెడ్డి కృష్ణారెడ్డి చెన్నకేశవరెడ్డి పాలెం మహేష్ రెడ్డి పుల్లారెడ్డి స్రవంతి శ్రవంత్ కుమార్ రెడ్డి కళ్యాణ్ రెడ్డి సహదేవ రెడ్డి హరినాథ్ రెడ్డి అమూరు పద్మనాభ రెడ్డి ఆమూర్ శివారెడ్డి రమణారెడ్డి ఆమూరునితీష్ కుమార్ శరత్ కుమార్ రెడ్డి జనార్దన్ రెడ్డి జయరామిరెడ్డి బాలిరెడ్డి ప్రతాప్ రెడ్డి జయ చంద్రారెడ్డి సుధాకర్ రెడ్డి చలమారెడ్డి కొత్తపల్లి ఓబుళరెడ్డి దేరంగుల రామాంజనేయులు శ్రీనివాసులు ఓబులయ్య ఓబులేసు శంకర్ శ్రీనివాసులు అరుణ్ కుమార్ శ్రీకాంత్ శివ సురేష్ హరి సాయి గణేష్ రేవంత్ ఇబ్రహీం ఖలీల్ హాబిబుల్లా జాఫర్ ఇమామ్ బాషా ఫక్రుద్దీన్ మహబూబ్ బాషా జమాల్ ముమ్మే మహేష్ లోమడ రిషికేశవరెడ్డి రేలా నాగరాజు సోషల్ మీడియా విభాగం ముల్లా బిలాలు , షేక్ గౌస్ ,శ్రీకాంత్ ,షేక్ష , రేవంత్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్తలను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలి

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** గ్రామంలోని తడి పొడి చెత్తలను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని డిపిఓ రాధమ్మ అన్నారు. బుధవారం కోనంపేట గ్రామంలో అంబాసిడర్ పనితీరుపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్ద పెద్ద గ్రామాలలోని చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తడి పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు గ్రామంలోని పనులు సక్రమంగా జరిగినప్పుడు గ్రామాభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామంలో ఎక్కడే గాని చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సిరిబాబు గ్రామపంచా సర్పంచ్ లక్ష్మీనారాయణ అంబాసిడర్లు పాల్గొన్నారు.



## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### - లక్కిరెడ్డిపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజు నాయక్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** లక్కిరెడ్డిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కృష్ణంరాజు నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయనా కడపలో పనిచేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. పేకాట,జూదం, కోడిపందాలు, మాదకద్రవ్యాలు, అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యం లాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కటారుపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో డైనింగ్ హాల్, మీటింగ్ హాల్ ప్రారంభం






**గాండ్లపెంట – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** మండలంలోని కటారుపల్లి గ్రామంలోని మండల ప్రైమరీ స్కూల్‌లో బుధవారం గ్రామానికి చెందిన దాత తుంగ నంద వేమారెడ్డి చేతుల మీదుగా బుధవారం డైనింగ్ హాల్, మీటింగ్ హాలును ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గార్డెన్‌ను ఎంఈఓ శ్రీనివాస నాయక్ ప్రారంభించారు అదేవిధంగా డైనింగ్ హాలును దాత తుంగ నంద వేమారెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ నాయక్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దాత ఔదార్యాన్ని కొనియాడారు. పాఠశాల అభివృద్ధిని ఉపాధ్యాయుల కృషి పట్టుదలను అభివృద్ధిని గ్రామ పెద్దలు కొనియాడారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాసులు నాయక్, మరియు కృష్ణ నాయక్, ప్రధాన ఉపాధ్యాయులు సరళ, గంగాధర్, సురేష్ బాబు, గ్రామ పెద్దలు సుధాకర్ రెడ్డి, ఎంపీ ఎస్ సిబ్బంది షంషీర్, మాధవి, ప్రమీల, ప్రభావతి, శారద, శ్రావణి, హైస్కూల్ సిబ్బంది జనార్ధన, పురుషోత్తం, విశ్వనాథ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి ప్రసాద్,పద్మజ, రాయుడు, అశోక్ ,శ్రీకాంత్ రెడ్డి ,హేమంత్, సిఆర్పి ప్రహల్లాద, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందాం

### - చెన్నారెడ్డి కాలనీలో అనుబంధ విభాగ కమిటీల సమావేశం

**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కాలనీ 30వ వార్డులో అనుబంధ విభాగాల కోర్ కమిటీ సమావేశాన్ని వార్డు నాయకులు నిరంజన్ రెడ్డి, టైటాస్, బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి, సత్తార్, కేకే రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు కమిటీ సభ్యుల ప్రకారమే వార్డులలో పనులు జరుగుతాయన్నారు. 2029లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం మన పైన ఉందన్నారు. జగనన్న పాలనలో ప్రతి కార్య కర్తకు న్యాయంజరుగుతుందన్నారు. వైసిపి పట్టణ అనుబంధాల కోర్ కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యన్నారు. వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను వార్డులోని ప్రజలకు వివరించాలన్నారు. జగనన్న పాలనలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.అలాగే పదవులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీలను నిర్వహించడం జరిగిందన్నారు. కమిటీల నిర్ణయం ప్రకారమే ఇకనుంచి పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, ఫైర్ రామకృష్ణ, రాజశేఖర్, శ్రీరాములు, కృష్ణ,వైకాపా నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే

### - టిడిపి పొలిట్ బ్యూరో శ్రీనువాసులు రెడ్డి



**వేంపల్లె – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** పులివెందులోని ఒకే కుటుంబం నుండి ఇద్దరు వ్యక్తులు ముఖ్యమంత్రిలు పని చేసి కూడ రైతులకు, ప్రజలకు సాగు నీరు, త్రాగునీరు నీళ్లు ఇవ్వలేదని కాని టిడిపి ప్రభుత్వ పాలనలో పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కు తుందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్ప గారి శ్రీనువాసులు రెడ్డి(వాసు) పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెకు చెందిన వైసిపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే) ఆధ్వర్యంలో వైసీపీ నుండి టిడిపిలోకి భారీ సంఖ్యలో చేరారు. దీంతో పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్ప శ్రీనువాసులు రెడ్డి, టిడిపి పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి టిడిపి పార్టీలో చేరిన వారందరికి పసుపు కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా టిడిపి కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. రోడ్ షో లో బిటెక్ రవికి గజమాలతో సత్కరించారు. అనంతరం పుల్లయ్య తోటలో నిర్వహించిన బహిరంగ సభలో పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా భారీ చేరికలు జరుగుతున్నట్లు చెప్పారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాట ప్రకారం యర్రబల్లి చెరువుకు నీళు ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం టిడిపి పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ టిడిపిలో చేరిన చంద్రశేఖర్ రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. వైసిపికి కంచుకోటనైనా అమ్మగారి పల్లెలో నాకు బాణాసంచా పేల్చి, పూలవర్షంతో ఘనస్వాగతం పలికారని తెలిపారు. అది జీర్ణించుకోలేకే నాపై అసత్య ప్రచారాలు చేయడం జరిగిందని చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కూడ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండాను ఎగుర వేయడం



జరుగుతుందని చెప్పారు. నాకు నిరసన సెగ తగిలిందని వైసీపీ గొప్పలు చెప్పు కోవడం శోచనీయం అన్నారు. ఇళ్లను ఖాళీ చేయించి బలవంతంగా జనాన్ని రప్పించారని, తాము స్వచ్ఛందంగా రాలేదని ఆ జనాలే చెప్పిన వీడియోలు కూడ తన దగ్గర ఉన్నట్లు చెప్పారు. లాయర్ ఈశ్వరరెడ్డి టీడీపీలో చేరడంతో మా బలం పెరిగిందని చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు పులివెందుల పర్యటనకు రాను న్నారని చెప్పారు. సిఎం వచ్చేలోపు నియోజ కవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల న్నింటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. పులివెందుల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కాబట్టి రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేయడం ఖాయమని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన దిల్ మాంగే పార్టీలో చేరినట్లు చెప్పారు. ఇంకా ప్రజల నుంచి ప్రవాహం మొదలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, చంద్రశేఖర్ రెడ్డి (దిల్ మాంగే), పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, శివకృష్ణారెడ్డి, మొండోడు గౌస్ బాబా, గొడ్డన్ల శివయ్య , వీరభద్ర, మహమ్మద్ ఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు యాసిన్, భాస్కర్, మాబు షరీఫ్ తొపాటు టిడిపి నేతలు, కార్య కర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలే కీలకం



**లింగాల– సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మార్గదర్శకత్వంలో గ్రామ గ్రామాన కమిటీల ఏర్పాటు వేగం పెంచుకుంది. బుధవారం వైసిపి గ్రామ అను బంధ విభాగాల కమిటీ పర్యవేక్షణ లింగాల మండలం అంకెన వారిపల్లి గ్రామంలోని మండల, గ్రామ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ శక్తిని పెంపొందించడం, ప్రభుత్వ పథకాల సమా చారాన్ని ప్రజలకు సులభంగా చేరవేయడం, పార్టీ సిద్ధాంతాలు ప్రతి ఇంటికీ చేరేలా చేయడం కమిటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ కమిటీల ఏర్పాటు ద్వారా వైసీపీ మరోసారి గ్రామాల్లో బలోపేత దిశగా కీలక అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా డాక్టర్ హరీష్ జన్మదిన వేడుకలు



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** స్థానిక వేంపల్లెలో పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసైనికులు పులివెందుల నియో జకవర్గ ఇంచార్జి డాక్టర్. హరీష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మదర్ తెరెసా వృద్ధ ఆశ్రమం లో, అన్నదానం పండ్లు పంపిణి చేసి, కేక్ కట్ చేపించారు, మరల గాంధీ రోడ్ లో బీజేపీ జనసేన టీడీపీ నాయకులు, కేక్ కట్ చేసి ఘనంగా సత్కరించారు, మరలా ఇడుపులపాయ గ్రామం లో జనసేన జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు, కార్యకమానికి కడప జిల్లా నాయకులు, జీ.వి రమణ, ఇడుపులపాయ నాయకులు పోతి రెడ్డి జయచంద్ర ముఖ్యులుగా వ్యవహ రించారు. కార్యక్రమంలో 100కు పైగా జనసైనికులు, నాయకులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధి కోసం మరింత కష్టపడి పని చేస్తాం

### - సింగిల్ విండో అధ్యక్షులు




**కదిరి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని సింగల్ విండో అధ్యక్షులు నాగూరు శ్రీనివాస్ రెడ్డి కే బత్తలపల్లి రామచంద్ర నాయుడు పేర్కొన్నారు. కదిరి మండలం గొల్లల చెరువుకే బ్రాహ్మణపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు నాగూరు శ్రీనివాస్ రెడ్డి బత్తలపల్లి రామచంద్ర లు బుధవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పివిఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే తమకు సింగల్ విండో అధ్యక్షులుగా ఎంపిక చేసి పదవులు ఇచ్చినందుకుగాను తమకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేని సన్మానించినట్లు చెప్పారు ఈ పదవులు రావడం వల్ల పార్టీ పరంగా పార్టీ అభివృద్ధి కోసం తాము మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసే గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసి తమ గ్రామ పంచాయతీల పరిధిలోనే కాకుండా మండల వ్యాప్తంగా కూడా పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దిరెడ్డి వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**కదిరి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలో వెలసిన శ్రీమద్ ఖాద్రి శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయ నూతన ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్–(2026)ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ఖాద్రీ ఆలయం లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆలయ డిప్యూటీ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి ప్రధాన అర్చకులు నరసింహచార్యులు, పార్థసారథిచార్యులు టిడిపి నాయకులు గాలివీటి కృష్ణమోహన్ నాయుడు, పచ్చి పులుసు సురేంద్రబాబు, చంద్రశేఖర్, మనోహర్, కూనక పుల్లయ్య, కృష్ణమూర్తి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# కోటపోలూరు హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

- డా. నెలవల విజయశ్రీ
- ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనమే ప్రభుత్వ లక్ష్యం
- విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి
- మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ





**పెళ్లకూరు– సూర్యా వాస్తవం, డిసెంబర్ 17:** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. కోటపోలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాల పరిధిలోకి అడుగుపెట్టిన వెంటనే విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, యూనిఫాం అమలు తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులు తప్పనిసరిగా చెప్పులు ధరించి పాఠశాలకు రావాలని, శుభ్రత, క్రమశిక్షణ పాటించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. చిన్న వయసులోనే మంచి అలవాట్లు అలవరుచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు ఆమె హితవు పలికారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని ఎమ్మెల్యే ప్రత్యేకంగా సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగవచ్చని ఆమె పేర్కొన్నారు.

**విద్యా వసతులపై లోతైన పరిశీలన**



పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే స్వయంగా తనిఖీ చేశారు. ప్రయోగాత్మక విద్యకు ల్యాబ్‌లు కీలకమని, గ్రంథాలయాన్ని విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఆదేశించారు. పఠనాభిరుచి పెరిగితేనే విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆమె తెలిపారు.

**మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ**

మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీసిన ఎమ్మెల్యే, మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పటిష్టంగా ఉంటేనే చదువులో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. నెలవల విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎదగాలి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే నా ప్రధాన లక్ష్యం. అందుకు అవసరమైన పూర్తి సహకారం నా వైపు నుంచి ఉంటుంది" అని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



### అల్లూరికి అండగా నిలిచిన

# ఫజులుల్లా ఖాన్ - షేక్ మదీనా పుస్తకావిష్కరణ

**హిందూపురం – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** హిందూపురం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో హిందూపురం పట్టణ డీఎస్పీ మహేష్ అధ్యక్షతన భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ – షేక్ మదీనా పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఒన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్ నాయుడు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జనార్దన్, కవులు రచయితలు రాజశేఖర రెడ్డి. ఏటిగడ్డ అశ్వర్థనారాయణ. గంగాధర్. మౌలానా సాజిద్. మౌలానా ఇర్ఫాన్. మౌలానా ఉబెదుల్లా హుసేన్. జామియా వైస్ ముతవల్లీ ఫారూఖ్. అబూ హురైరా మసీదు ముతవల్లీ అన్సార్ తదితరులు పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.... స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ బానిస సంకెళ్లు ఛేదించడానికి పోరాడిన అల్లూరి సీతారామరాజు కు వెన్నుదన్నుగా నిలిచి అల్లూరి సీతారామరాజు కు తుపాకీ గురిపెట్టటం తుపాకీ కాల్చటం నేర్పిన గురువు షేక్ మదీనా గురించి



అల్లూరి సీతారామరాజుకు వెన్నుదన్నుగా నిలిచి స్వాతంత్ర్య ఉద్యమంలో సహకరించిన పోలవరం డిప్యూటీ కలెక్టర్ అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ గురించి ఈ పుస్తకం మానవీయ సందేశాన్ని మత సామరస్య సందేశాన్ని దేశభక్తి సందేశాన్ని ఇస్తుందని ఫజులుల్లా ఖాన్ జ్ఞాపకార్థం ఫజులుల్లా బాద్‌గా ఊరి పేరును ప్రజలు పెట్టారని ఫజులుల్లా ఖాన్ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాన్ని నిర్మించి ఆలయ బాగోగులు ఆలయ నిర్వహణ కు తన 15 ఎకరాల భూమిని దానం చేయడం మత సామరస్యానికి నిదర్శనం అని ఇలాంటి మహా మనీషి చరిత్రను వెలికితీసి దేశం లో సామరస్య వతావరాణం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చరిత్రకారుడు సయ్యద్ నసీర్ అహ్మద్ లాంటి మహనీయుడికి ఋణ పడిఉంటామని ఉమర్ ఫారూఖ్ ఖాన్ పేర్కొన్నారు పుస్తకావిష్కరణ అనంతరం మత సామరస్యం పరమత సహనం గురించి చర్చించారు.

## ముమ్మరంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు






**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు నియంత్రించడమే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో బ్రీత్ అనలైజర్ పరికరాల సహాయంతో వాహనదారులను పరీక్షించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రజల ప్రాణాలు రక్షించడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని...ఇలాంటి చర్యల వల్ల వాహనాల డ్రైవర్లతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని వాహనదారులు గుర్తించాలన్నారు. ప్రతీరోజూ ఈ విధమైన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## హెల్మెట్ ఒక శిక్ష కాదు..

### -మీ జీవితానికి.. మీ కుటుంబ భవిష్యత్తుకు ఇచ్చే భద్రత

**తిరుపతి –సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ద్విచక్ర వాహనదారుల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది.

– “నో హెల్మెట్ నో పెట్రోల్.. హెల్మెట్ వేసుకొని ప్రమాదాలను నివారించండి” అనే నినాదంతో, ట్రాఫిక్ సీఐ సంజీవి వారి నేతృత్వంలో ట్రాఫిక్ సిబ్బంది మొబైల్ అవగాహన వాహనం ద్వారా నగరమంతా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిన ప్రాముఖ్యతపై చైతన్యం కల్పిస్తున్నారు.

– జిల్లా పోలీస్ శాఖ ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా, హెల్మెట్ ధారణను ప్రతి వాహనదారుడి బాధ్యతగా తీసుకోవాలని, రోడ్డు భద్రతలో భాగస్వాములవాలని కోరుతున్నారు.




## గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన

- ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు మానుకోవాలి
- అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్




**రాయచోటి–సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు చేపట్టడం ద్వారా మహాత్ముని ఆశయాలను విలువలను కార్మిక హక్కులను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నేతాజీ సర్కిల్ బస్టాండ్ రోడ్డు డివైడర్ పై ఉన్న గాంధీ విగ్రహం వద్ద గాజుల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్, ఉపాధ్యక్షుడు ఆర్ చెన్న కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, జిల్లా జనరల్ సెక్రెటరీ అమీర్ మరి కొంతమంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించు కోవాలను కోవడం, కొత్త జిల్లాల ద్వారా పని హక్కును పూర్తిగా రద్దు చేసేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాలు సంబంధించి వేతనాలు నిధుల లో కేంద్ర ప్రభుత్వం బాధ్యతను ఉపసంహరించుకుని రాష్ట్ర ప్రభుత్వంపై భారాన్ని మోపాలనుకోవడం వంటి చర్యలు ద్వారా పథకాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నాన్ని ప్రయత్నిస్తోందని అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సురేంద్ర, ఖాదర్ ఖాన్, సల్మాన్, షబ్బీర్ మస్తాన్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** లక్కిరెడ్డిపల్లిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్‌ను లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీచైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు పూలగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని శాంతి భద్రతా పరిరక్షణకు పోలీసులు చేస్తున్న సేవలను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై సంక్షిప్తంగా చర్చించిన నాయకులు, నూతన సీఐ నాయకత్వంలో చట్టం–శాంతి నిర్వహణ మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ అభివృద్ధి ఉపాధ్యక్షుడు కొండూరు వెంకటరమణ రాజు, తుమ్మల మల్లి, కుళ్లాయప్ప, ప్రసాద్, డీలర్ అమీర్, తదితరులు ఉన్నారు.

## డమరేశ్వర్ స్వర్ణలత ఇంటి ముందు హిజ్రా ధర్నా

- రూ. 6 కోట్ల డబ్బు, బంగారు తీసుకొని ఇవ్వకుండా చంపుతామని బెదిరింపు..



**మదనపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** తనను నమ్మించి, తన వద్ద సుమారు రూ. 6 కోట్ల డబ్బు, బంగారు ఆభరణాలు తీసుకొని ఇవ్వకుండా వేధింపులకు పాల్పడటమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నారు అంటూ హిజ్రా ఇంజరపు స్వాతి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం గౌతమినగర్ లోని డమరేశ్వర్ స్వర్ణలత ఇంటిముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను డమరేశ్వర్ స్వర్ణలత ఇంటి సమీపంలో ఉండేదాన్నని, నన్ను నమ్మించి చీటీల వ్యాపారం పేరుతో తన వద్ద ఉన్న బంగారు నగలు, డబ్బులు తీసుకొని తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. తన వద్ద తీసుకున్నట్లు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ అధికారులు తమకు న్యాయం చేయలేదని, అందరినీ వారు మేనేజ్ చేసుకుంటూ తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. మా అక్క 15 నెలలుగా కువైట్ లో సంపాదించిన మొత్తాన్ని వారికే ఇచ్చేశానని పేర్కొంది. గత ఐదు నెలలుగా తనను ఫాలో చేస్తూ, ఎక్కడికి వెళ్లినా అనుసరిస్తూ, తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీంతో తాను ఇంటిలోనే ఉండి పోవాల్సి వచ్చిందని, వాళ్ళ వల్ల హౌస్ అరెస్ట్ అయ్యానని, తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని చెప్పుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసేందుకు ప్రయత్నిస్తున్నానని అయితే ఇంటి నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏది ఏమైనప్పటికీ తాను ముఖ్యమంత్రిని కలుస్తానని, ఈ క్రమంలో తనకు ప్రాణహాని జరిగితే, అందుకు డమరేశ్వర్, స్వర్ణలత దంపతులే బాధ్యులని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు తమ బిడ్డలను ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా హిజ్రా ఆవేదనను గుర్తించి ఆమెకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

## సచివాలయాలలో

# బయోమెట్రిక్ తప్పనిసరి వేయాలి

**- ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం**



**గార్లదిన్నె - సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** మండల కేంద్రమైన గార్లదిన్నెలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో యం.గోపాల్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలోనూ జాబ్ కార్డు లబ్ధిదారులు కనీసం 50 మందికి తక్కువ కాకుండా చూడాలని ఫీల్డ్అసిస్టెంట్లు, కార్యదర్శులకు సూచించారు. మీరు చేయించే పనులు గ్రామానికి ఉపయోగకరముగా, నాణ్యతగా ఉండాలన్నారు. గ్రామాలలో జాబ్ కార్డు లబ్ధిదారులను పెంచాలని వారికి వంద రోజుల వరకు నిరంతరం పనులు కల్పించాలని, ప్రతిరోజు కాలపరిమితం ప్రకారం సక్రమంగా నాణ్యత పనులను చేయించాలన్నారు.

**-స్వామిత్వ స్వర్ణ పంచాయితీ బకాయిలను వసూలు చేయాలి**

ఎస్ డబ్ల్యూ ఎస్ పిసీ షర్ట్స్ వర్మీ కంపోస్ట్ స్వచ్ఛరతం ద్వారా తడిపొడి చెత్తను చెత్త ఉత్పత్తి కేంద్రాలకు తరలించాలని, పంచాయితీలలో ఉన్న నిధుల మేరకు 15ఎఫ్ సి జనరల్ ఫండ్స్ పనులు పూర్తి చేయవలసిందిగా ఎంపీడీవో ఎం.గోపాల్ ఆదేశించడం అయినది. మండలంలోని స్వర్ణ పంచాయతీలో కేశవాపురం, కృష్ణాపురం, సిరివరం, గ్రామాలు దాదాపు 50 వేలు పైబడి బకాయిలను తక్షణ చర్యగా వసూలు చేయాలని, అలాగే గార్లదిన్నె, బూదేడు, పెనకచర్ల, కోటంక, తిమ్మంపేట, ఇల్లూరు, ముకుందాపురం, మర్తాడు, పంచాయతీలు లక్ష రూపాయలు పైబడి బకాయిలు ఉన్నాయని వాటిని 2026



జనవరి 31వ తేదీ లోపు వసూలు చేయాలన్నారు. అలాగే కల్లూరు 20 లక్షలు గార్లదిన్నె 15 లక్షలు పైబడి బకాయిలను ఫిబ్రవరి 28 లోపు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించడమైనది. గార్లదిన్నె మండలంలోని 16 సచివాలయాల సిబ్బంది. పంచాయతీలలో పనిచేసే సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 9-30 నుండి 10,30 లోపు, సాయంత్రం 5,30 గంటలకు బయోమెట్రిక్ వేయాలని, సిబ్బందిని ఆదేశించడం అయినది. ప్రభుత్వ నిబంధన ప్రకారం విధులను సక్రమంగా నిర్వర్తించాలని, డిపిఆర్ ఓ ఆదేశాల మేరకు కఠిన చర్యలు గైకొనబడునని తెలియజేశారు. గోకులం సెల్ కంపోస్ట్ బిట్స్ వర్క్, ఫారం ఫండ్స్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఐ హెచ్ హెచ్ హెచ్ ఎల్ వాటర్ సమస్యలను గ్రామ పంచాయతీలు త్వరితగతిన పలువులు పూర్తి చేయుటకు ఎస్టిమేట్స్ వేసి పూర్తి చేయాలని ఎంపీడీవో ఉక్కుమ్ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యం.గోపాల్, ఏపీఓ, ఓబన్న, సచివా లయాల ఈఓఆర్ డి ఉషారాణి,ఇసి. అయూబ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థిని షేక్ జియానాజ్‌ని అభినందించిన ట్రిబుల్ ఐటీ డైరెక్టర్



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** ట్రిబుల్ ఐటీ లో 2016- 22 బ్యాచ్ లో సివిల్ ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన పూర్వ విద్యార్థిని షేక్ జియానాజ్ ఇటీవల రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెలువరించిన పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాలలో సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్ గా ఎన్నికైనందుకు ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె విజయం ట్రిబుల్ ఐటీకి, విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి దాయకమని ఆమెను కొనియాడారు. విద్యార్థులందరూ సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడాలనుకుంటారు. అయితే తాను ఉపా ధ్యాయ వృత్తి పట్ల మక్కువతో చేస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి లెక్చరర్‌గా విజయం సాధించడం మరింత ఆనందదాయకమని వెలువరించారు. తాను 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన నోటిఫికేషన్ లో దరఖాస్తు చేసి, ఇటువంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దనే ఆన్లైన్ లో ఎన్ పి టి ఎల్ వీడియోలు చూస్తూ సొంతంగా నోట్స్ రాసుకొని చదివి తాను పాలిటెక్నిక్ లెక్చరర్ కు ఎంపికయ్యానని షేక్ జియానాజ్ తెలిపారు. తన తండ్రి సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ముస్తాక్ అహమ్మద్ స్కూటర్ మెకానిక్ గా పనిచేస్తుంటాడు అని ఆమె తెలిపారు. ట్రిపుల్ ఐటిలో చదువుతున్నప్పుడే సమయాన్ని దుర్వి నియోగం చేసుకోకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధమైతే ఇంజనీరింగ్ విద్య పూర్తయిన సంవత్సరం లోపే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపలనాధికారి డా. పి రవికుమార్ , డీన్ రమేష్ కైలాస్, ఉన్నత విద్య మరియు పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి. కోనప్ప, డైరెక్టర్ పర్సనల్ అసిస్టెంట్ మహబూబ్ భాష ,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు నాగార్జున సిమెంట్ సహకారం



**నాయుడుపేట - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో నాగార్జున సిమెంట్ కంపెనీ నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కు 30 ట్రాఫిక్ బారికేడ్స్‌ను అందజేసింది. బుధవారం పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఈ బారికేడ్స్‌ను నాయుడుపేట పట్టణ సీఐ బాబీకి కంపెనీ సీనియర్ మేనేజర్ కె.వి. నందన రావు, జిల్లా సేల్స్ ఆఫీసర్ రవి ప్రకాష్‌లు అధికారికంగా అందించారు. ఈ సందర్భంగా సీఐ బాబీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం ప్రశంసనీయమని తెలిపారు. పట్టణంలో వాహన రద్దీ నియంత్రణకు, రోడ్డు భద్రతను మెరుగుపర్చేందుకు ఈ బారికేడ్స్ ఉపయోగపడ తాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించిన నాగార్జున సిమెంట్ కంపెనీ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి పుట్టినరోజు వేడుక

**- మానవసేవే మాధవ సేవగా కాంగ్రెస్**

**- డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్**



**రాయచోటి - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసేవే మాధవ సేవగా భావించి కార్యక్రమాలు నిర్వహించడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. వైయస్ షర్మిల పుట్టినరోజు సందర్భంగా రోగులకు పళ్ళు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో దర్గాలో అన్నదాన కార్యక్రమాలు, కరోనా సమయంలో పేదలకు ఆహార పొట్లాలు, చెక్పోస్ట్ శివాలయం వద్ద గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం చేయడం జరిగిందిని ప్రజాసేవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నింగి నుండి పోలీస్ శాఖ నిఘా...

**- గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై,**
**అసాంఘిక కార్యకలాపాలపై అనుమానిత ప్రాంతాలపై దాడుల స్పెషల్ డ్రైవ్**
**- అత్యాధునిక డ్రోన్ కెమెరాల నిఘా.**
**- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పడుతున్న పోలీసులు**
**- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే**
**కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు, సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు వేంపల్లి సి.ఐ నరసింహులు ఆధ్వర్యంలో వేంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల తో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేయిస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అనుమానిత ప్రాంతాల నుండి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి వారిని పట్టుకుని కౌన్సిలింగ్ మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం వేంపల్లి పట్టణంలోని గండి రోడ్, రాజీవ్ నగర్, గవి మల్లేశ్వర స్వామి గుడి, తోపల్లికి వెళ్లే బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో నిరంతరం వేంపల్లి పట్టణంలోని, శివార్లలోని అనుమా నిత ప్రాంతాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని వేంపల్లి సి.ఐ నరసింహులు తెలిపారు.





## నూతన పంచాయతీ కార్యాలయానికి భూమిపూజ

**- టీడీపీ ఇంన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి**



**లింగాల - సూర్య వాస్తవం, డిసెంబర్ 17 :** లింగాల మండలం తాతిరెడ్డి పల్లి గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయానికి భూమిపూజ చేసిన పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి, లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి, తాతిరెడ్డి పల్లి గ్రామ టీడీపీ నాయకులు సురేంద్రనాథ రెడ్డి.ఈ శుభ కార్యక్రమంలో పాల్గొన్న వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి, మారెడ్డి భరత్ రెడ్డి,లింగాల మండల సింగిల్ విండో ఛైర్మెన్ నవీన్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ అమర్నాథ్ యాదవ్ , లింగాల నీటి సంఘం అధ్యక్షులు గురివిరెడ్డి, ఆర్డీఓ, ఎమ్ఆర్ఓ, రెవిన్యూ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ నూతన కన్వీనర్‌గా గొడ్డు వెలగల వెంకటప్రసాద్ ఎంపిక



**గాండ్లపెంట - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** గాండ్లపెంట మండలం తెలుగుదేశం పార్టీ నూతన కన్వీనర్‌గా గొడ్డు వెలగల వెంకటప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ కు తెలుగుదేశం పార్టీ మండల నాయకులు రెడ్డినాయక్ ఆధ్వర్యంలో చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన కన్వీనర్ మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ అన్నగారు నా పైన నమ్మకం ఉంచి ఇలాంటి అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటూ విశ్వాసబాధ్యుడనై ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, సికిందర్, దొణికొండ ఆనంద్, నగేష్, అక్రమ్, సిద్ధారెడ్డి, ఆసిఫ్, అఫ్జల్‌తో పాటు ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం..

**- కాపర్ వైరు చోరీ**



**పులివెందుల క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 17:** పులివెందులలో మరలా కేబుల్ దొంగల వీరవిహారం మొదలైందని ప్రజలు వాపోవడం జరుగుతుంది. బుధవారం బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో ట్రాన్స్ఫారం ధ్వంసం చేసి కాపర్ వైరు, ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన చోటు చేసుకోవడం జరిగింది. ఏది ఏమైనప్ప టికీ ఈ విధంగా దొంగతనాలు జరగడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చెందడం జరుగుతుందని తెలిపారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )